

3న జిల్లా స్థాయి యోగా పోటీలు

పార్వతీపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం కలెక్టరేట్‌లో వచ్చేనెల 3న జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి పోటీలు చేపట్టనున్నారు. 10 నుంచి 55 సంవత్సరాల లోపు వారు అర్హులు. పురుషులు, స్త్రీల కేటగిరీల్లో వేర్వేరుగా నిర్వహించే పోటీలకు ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. విజేతలైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఇతర వివరాలకు ఈ 98666 50998, 99853 49980 నెంబర్లను సంప్రదించాలని, ఈనెలాఖరులోగా పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

ప్రభుత్వ చొరవ

ఈడేరనున్న కల

- గిరిజన ఇంజనీరింగ్ కళాశాలపై ప్రభుత్వం దృష్టి
- పనుల పూర్తికి చంద్రబాబు, లోకేశ్ ఆదేశాలు
- వైసీపీ తీరుతో నిలిచిన నిర్మాణం
- తాజాగా ముఖ్యమంత్రి చొరవతో కదలిక



కళాశాల భవనాలు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి, చైర్మన్ రాజశేఖర్



గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మధ్యలో నిలిచిపోయిన కళాశాల నిర్మాణం

పార్వతీపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంగా కారణంగా కురుపాంలో మధ్యలో నిలిచిన గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి మోక్షం లభించనుంది. త్వరలోనే పనులు పునఃప్రారంభం కానున్నాయి. ఇటీవల ఈ కళాశాల అంశాన్ని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని వారు ఆదేశించారు. దీంతో గిరిజన విద్యార్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కళాశాల పనులు పూర్తయితే వారికి స్థానికంగానే ఇంజనీరింగ్ విద్య అందుబాటులోకి వస్తోంది.

గత వైసీపీ పాలనలో..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కురుపాంలో సుమారు రూ.150 కోట్లతో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. 2021లో పనులు ప్రారంభించారు. అయితే ఆ తర్వాత సకాలంలో బిల్లులు చెల్లించలేదు. గత ప్రభుత్వ పాలనలో మొదట్లో రూ.నాలుగు కోట్ల 53 లక్షల వరకు బిల్లులు చెల్లించారు. అనంతరం రూ.15 కోట్లకు బిల్లులు అప్‌లోడ్ చేసినప్పటికీ చెల్లింపులు జరగలేదు. ఆ తర్వాత కూడా బిల్లులు అప్‌లోడ్ చేసినా నిధులు మంజూరు కాలేదు. మొత్తంగా అప్పట్లో చేసిన పనులకు సుమారు రూ.16.50 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. పనులను మధ్యలోనే నిలిపివేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి...

కురుపాంలో మధ్యలో నిలిచిన గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం

(మిగతా 8వ పేజీలో...)

శాకంబరిగా ముత్యాలమ్మతల్లి



7లో

గంజాయి నియంత్రణకు

ప్రత్యేక బృందాలు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

పార్వతీపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి నియంత్రణ, ఆ కేసుల్లో ఎన్‌బీడబ్ల్యూ ముద్దాయిలను అరెస్టు చేసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. పార్వతీపురంలోని జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శనివారం ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో అర్థ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆరు నెలల్లో జరిగిన నేరాలు , ఛేదించిన కేసులు, పోలీస్ యంత్రాంగం చేపట్టిన చర్యలు పెండింగ్ కేసులు , చోరీలు, మిస్సింగ్, చీటింగ్ తదితర కేసుల్లో పురోగతిపై ఎస్పీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ..' శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలి. ఎన్‌కౌంటర్, సరెండర్‌లో గాని మావోయిస్టులకు సంబంధించి వివరాలను సేకరించి పోలీస్‌స్టేషన్ల పరిధిలో వారు నేరస్థులో కాదో సరిచూసుకోవాలి. గిరిజనులకు మేలు చేసే ఏ కార్యక్రమమైనా పోలీసులు ముందుండి జరిపించాలి. ప్రజల ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలి.' అని తెలిపారు. కన్విక్షన్ పెరిగేలా ఏ విధంగా దర్యాప్తు చేపట్టాలో రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదర్ తెలిపారు. భూ వివాదాలపై ఏ విధంగా

(మిగతా 8వ పేజీలో...)



వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పార్వతీపురంలో అంధకారం

- వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

పేదరిక నిర్మూలన మీ చేతుల్లోనే..

- రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు

అంతర్రాష్ట్ర రహదారిలో కూరగాయల వ్యాన్ బోల్తా



8లో

ప్లాస్టిక్ రహిత సమాజంలో

భాగస్వాములవ్వాలి

- జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా

పార్వతీపురం రూరల్, జూలై19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని జిల్లా ప్రత్యేకాధికారి నారాయణభరత్‌గుప్తా పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం పెదబొండపల్లిలో స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి రెండు రకాల డస్ట్ బిన్లను అందించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేసేందుకు వాటిని వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. ' జిల్లాలో ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగానికి స్వస్తిపలకాలి. గుడ్డ సంచులనే వాడాలి. పర్యావరణానికి హానికరం లేని వస్తువులను వినియోగించాలి.' అని తెలిపారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. అంతకుముందు వారు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, డీఆర్‌డీఏ ఏర్పాటు చేసిన గుడ్డ సంచుల విక్రయ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ప్రజలకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ● జిల్లాలో ప్లాస్టిక్ రహిత జీవన సరళిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ప్రత్యేకాధికారి నారాయణభరత్‌గుప్తా తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ' నో ప్లాస్టిక్ జోన్' పై పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి గుడ్డ సంచులను అందించారు.



పెదబొండపల్లిలో పర్యటిస్తున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రతి గ్రామం ఓడీఎఫ్ ప్లస్ కావాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం ఓడీఎఫ్ ప్లస్ (బహిరంగ మలవిసర్జన రహిత) కావాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా అధికారులు, మండల అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..' గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి. బహిరంగ మల విసర్జన వల్ల పరిసరాలు, తాగునీరు, వాతావరణం కలుషితమవుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తేఅవకాశం ఉందనే విషయాన్ని ప్రజలకు తెలియ జేయాలి. ఈ సీజన్‌లో అతిసారం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. ఈ నేపథ్యంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పల్లెవాసులను చైతన్యపర్చాలి. గోతుల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. మీడియాలో వచ్చే వార్తలపై స్పందించాలి.' అని తెలిపారు. డీఆర్వో కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



ఉల్లిభద్ర ప్రాంతంలో..

వాన కురిసే.. మది మురిసే..

- నారుమడులకు జీవం ● పంట పొలాల్లోకి నీరు ● రైతుల్లో ఆనందం

పార్వతీపురం/గరుగుబిల్లి, జూలై19(ఆంధ్రజ్యోతి): వరుణుడు కరుణించాడు.. ఎట్టకేలకు జిల్లాలో వర్షం కురిసింది. పంట పొలాల్లో భారీగా నీరు చేరడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులుగా వాన కోసం ఎదురుచూసిన వారికి ఊరట లభించింది. గత కొద్ది రోజులుగా వర్షాలు లేక వరి ఎదలు, నారుమళ్లు ఎండిపోయిన విషయం తెలిసిందే. వాటిని బతికించేందుకు ఇంజన్ల సాయంతో రైతులు నీటిని మళ్లించారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షం నారుమడులకు జీవం పోసింది. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల దమ్ములు ప్రారంభమయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఉబాలకు సన్నద్ధమవుతున్నారు. మరో 15 రోజుల వరకు వర్షం కురిస్తే.. ఖరీఫ్ పంటలకు ఢోకా ఉండదని రైతులు భావిస్తున్నారు.



పార్వతీపురం మండలంలో..

25న కురుపాంలో జాబ్‌మేళా

కురుపాం,జూలై19(ఆంధ్రజ్యోతి): కురుపాంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణచైతన్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు 11 కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఏదైన డిగ్రీ పాసైన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

కేంద్ర పథకాలను పరిశీలించిన ప్రత్యేక బృందం

7లో



పెట్రోల్ బంకులపై పర్యవేక్షణేదీ?



- ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా మోసాలు ● ట్యాంపరింగ్‌తో తక్కువగా వస్తున్న చమురు
- కల్తీతో దెబ్బతింటున్న వాహనాలు ● నిబంధనలను గాలికొదిలేసిన నిర్వాహకులు ● తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు



రాజాం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో గోల్‌మాల్ జరుగుతోంది. కొన్ని బంకుల్లో కల్తీ చేస్తుండగా.. మరికొన్నిచోట్ల మిషన్ ట్యాంపరింగ్ చేసి విక్రయాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కనీస నిబంధనలు పాటించడం లేదు. బంకుల్లో తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 180 వరకూ పెట్రోల్ బంకులు ఉన్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లలో ట్యాంపరింగ్ చేస్తున్నారు. లీటరు పెట్రోల్‌కు 100, 200 మిల్లీ లీటర్ల వరకూ పక్కదారి పట్టిస్తున్నారు. బంకుల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదు. ఏరోజుకారోజు బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాలి. ఇది ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. నిత్యం పెట్రోల్, డీజిల్ పెరుగుదలతో వినియోగదారులు కూడా పట్టించుకోవడం లేదు. వాస్తవానికి పెట్రోల్ నాణ్యత తెలుసుకునేందుకు బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంటుంది. ఆ పేపరుపై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరి అయిపోతే అది నాణ్యమైన పెట్రోల్. మరకలుగా మిగిలిపోతే అది కల్తీ జరిగినట్లు నిర్ధారించవచ్చు. ఈ విషయం చాలామంది వినియోగదారులకు తెలియదు. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.110కు చేరింది. డీజిల్ రూ.100కు పైగా ఉంది. బంకులు అందుబాటులో లేనిచోట లూజు విక్రయాల పేరిట భారీ దోపిడీ జరుగుతోంది. లీటరు పెట్రోల్‌ను రూ.120కుపైగా విక్రయిస్తున్నారు. పైగా కల్తీ చేసి అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వాహనాలు పాడవుతున్నాయి.

మూడేళ్లలో 123 కేసులు..

గత మూడేళ్లలో అక్రమాలకు పాల్పడిన 123 మంది పెట్రోల్ బంకు నిర్వాహకులపై అధికారులు కేసులు నమోదు చేశారు. గత మూడు నెలల్లో 45 చోట్ల తనిఖీలు చేయగా.. 10 చోట్ల అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. జరిమానా

(మిగతా 8వ పేజీలో...)

'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలి

● మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ప్లాస్టిక్ ఫ్రీ అమలు చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఉత్పత్తి అవుతున్న వర్మీ కంపోస్టును వ్యవసాయ, ఉద్యాన పంటలకు వినియోగిం చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెత్తసంపద కేంద్రంలో



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో మల్లికార్జునరావు, తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎంపీడీవో కల్యాణి, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, సర్పంచ్ నరవ కొండమ్మ పాల్గొన్నారు.

దశలవారీగా ప్లాస్టిక్ నిర్మూలన

● పారిశుధ్య నిర్వహణలో క్లాప్ మిత్రల పాత్ర కీలకం ● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

చీపురుపల్లి, జులై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దశల వారీగా ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుం టున్నామని, అన్నివర్గాల సహకారంతో లక్ష్యాన్ని సాధిం చేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ తెలిపారు. పారిశుధ్యాన్ని మెరుగు పరచడంతో బాటు, పర్యావరణ పరిరక్షణపై అవగా హన కల్పించ డంకోసం ప్రతి నెలా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమా న్ని జిల్లాలో నిర్వహిస్తు న్నామని చెప్పారు. శనివారం చీపు రుపల్లిలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగం గా పంచాయతీ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడ లి వరకూ ర్యాలీ నిర్వ హించారు. మూడురోడ్లజంక్షన్‌లో ఏర్పాటుచేసిన మానవహారంలో కలెక్టర్ పర్యావరణంపై ప్రతిజ్ఞ చేయించారు. తొలుత పంచాయతీ కార్యాల యంలో జరి గిన ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒక్కో అంశానికి ప్రాధా న్యతనిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా ఈనెల కార్య క్రమాన్ని రూపొం దించామని చెప్పారు. పారిశుధ్య నిర్వహణలో క్లాప్ మిత్రల



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

పాత్రకీలకమన్నారు. అనంత రం క్లాప్‌మిత్రలకు సనించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈ వో సత్యనారాయణ, డీఎల్ డీవో హేమసుందర్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, చీపురు పల్లి సర్పంచ్ మంగళగి రి సుధారాణి, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఎంపీడీవో ఐ. సురేష్, తహశీల్దార్ డి.ధర్మరాజు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు



ఏడాది పాలనపై వివరిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న దని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె విజయనగరంలోని 29, 30, 31 డివిజన్ల లోనూ, మండల పరిధిలోని బియ్యాలపేట గ్రామంలో ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర, మండల నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే సుపరిపాలన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బంగార్రాజు

నెల్లిమర్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని చినబూరాడపేట, పారసాం గ్రామాల్లో టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్టీ నాయకులు బెల్లాన రాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో ఆనందంగా ఉన్నాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

జామి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలన కంటే ప్రస్తుత చంద్రబాబు పాలనలో చాలా సంతోషంగా ఉన్నామని లక్ష్మీపురం గ్రామ మహిళలు తెలిపారు. సుప రిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మె ల్యే కోళ్ల లలితకుమారి శనివారం లక్ష్మీపురంలో పర్యటించా రు. ఈసందర్భంగా ఆమె కూటమి పాలనపై అభిప్రాయా లు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, పార్టీ మండల కార్యదర్శి రమ ణ, ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని పండ్లు, కూరగాయాలతో అలంకరించిన దృశ్యం

శాకంబరిగా ముత్యాలమ్మతల్లి

జామి జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ గ్రామంలో గల ముత్యాలమ్మతల్లి శనివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి, ఈ ఏడాది పంటలు బాగా పండాలని పూజలు చేశారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

గజపతినగరం జూలై 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పాలకులు, అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు అధ్యక్షతన జరిగిన మొదటి సాధారణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ సభ్యులు నియోజకవర్గ స్థాయిలో రైతుల కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి ఐదు కొత్త ప్రతిపాదనలు వచ్చాయని, వాటి సాధ్యాసాధ్యాలు పరిశీలించి అతికొద్ది సమయంలో వాటిని అమల్లోకి తీసుకువచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ సెక్రటరీ చంద్రమౌళి, సూపర్‌వైజర్ వై.మురళి, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలి

నెల్లిమర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు డిమాండ్ చేశారు. ఆయన శనివారం నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ మొదలుకావడంతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు, ఇతర వ్యవసాయ అవసరాలకు నిధులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతు బజారును కొనసాగించాలి

విజయనగరం దాసన్నపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాత మహారాజు ఆసుపత్రి వద్ద ఉన్న రైతుబజారును కొనసాగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంతకాల ఉద్యమం నిర్వహించారు. ముందుగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ సంతకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులకు అన్యాయం చేస్తే సంఘంతో కలిసి పోరాడుతామన్నారు. 1999 నుంచి రైతు బజారు ఇక్కడే ఉందని, 26 ఏళ్లుగా 50 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.సురేష్, టీవీ రమణ, లక్ష్మి, రమణమ్మ, రమణ, జగన్మోహన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జామి తహసీల్దార్‌పై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

జామి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కృష్ణంరాజుపై జామి మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరుణ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమవేశంలో గొడికొమ్ము సర్పంచ్ భవానీ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో కొందరు రైతులు షెడ్లు వేసుకుని పశువులను ఉంచుతున్నారని, అయితే కొద్దిరోజుల కిందట ఎవరో ఫిర్యాదు ఇచ్చారని తహసీల్దార్ వాటిని కూల్చివేయడం తగదన్నారు. దీనిపై పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే మండలంలోని ఆక్రమణలను తొలగించాలన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పదేపదే ఫిర్యాదు చేయడంతో నోటీసులు ఇచ్చి కూల్చామని చెప్పారు. ఈ సమావేశానికి ఎక్సైజ్ అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సరయు, ఎంపీడీవో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయం

గరివిడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. గరివిడి పట్టణంలో నిర్మించిన సచివాలయం, రైతు సేవా కేంద్రం, సీసీ రోడ్లను ఆయన శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, టీడీపీ మండల నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, రెడ్డి గోవింద్, సత్యం మాస్టార్, వర్మరాజు, వటికల్ల సత్యం, సత్తిరాజు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా

చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలి

రాజాం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత వ్యవసాయ కార్యాలయం ఖాళీ స్థలంలో వేసిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చీకటి రఘునాథ్.. మున్సిపాలిటీ కమిషనర్ జె.రామప్పలనాయుడును కోరారు. శనివారం ఆయన ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. డంపింగ్ యార్డులా చెత్తవేసి ఉండటంతో కమిషనర్‌కు ఫోన్ చేశారు. ఖాళీ స్థలంలో చెత్తను వేయడ వల్ల కోర్టుకు ఆనుకుని స్థలం ఉండటంతో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టుకు వచ్చిన ప్రజల ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వెంటనే ఈ చెత్తను తొలగింపజేయాలని ఆయన కోరారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్.. సోమవారం పారిశుధ్య సిబ్బందిని పంపించి తొలగించేలా చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.

హరికథా పాఠ్యాంశానికి ప్రతిపాదనలు పంపండి

విజయనగరం దాసన్నపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే గజపతులతో ప్రప్రథమంగా నెలకొల్పబడిన విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో హరికథా పాఠ్యాంశానికి ప్రతిపాదనలు పంపించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 1919 నుంచి 1936 వరకూ 17 ఏళ్ల ప్రథమ అధ్యక్షుడిగా పనిచేసినా, సంగీత నృత్య కళాశాలలో హరికథా పాఠ్యాంశం లేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో విజయనగరం, రాజమహేంద్రవరం, విజయవాడ, నెల్లూరు, కర్నూలు, గుంటూరు ఆరు ప్రాంతాల్లో సంగీత కళాశాలలు ఉన్నాయని, ఒక్కచోట పాఠ్యాంశం లేక రాబోయే తరానికి హరికథ కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. ఏర్పాటయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాల కృష్ణ, కంది సీతారాం, బూర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను పరిశీలించిన ప్రత్యేక బృందం

విజయనగరం రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపడుతున్న పనులను కేంద్రం నుంచి వచ్చిన ప్రత్యేక బృందం శనివారం పరిశీలించింది. విజయనగరం మండలంలోని గుండాలపేట, చిల్లపేట, పినవేమలి గ్రామాల్లో పర్యటించి అక్కడ చేపట్టిన ఉపాధి హామీ పనులు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణాలను ఆ బృంద సభ్యులు పరిశీలించారు. ఆయా నిధులు వ్యయం క్షేత్రస్థాయిలో పనుల ప్రగతి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల నేరుగా లబ్ధిదారులతో మాట్లాడి కేంద్ర ప్రయోజిత పథకాల అమలు తీరు ఎలా ఉందో ఆరా తీశారు. కొన్ని చోట్ల పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడాన్ని గమనించి.. తక్షణం ఆయా పంచాయతీలకు భవనాలు నిర్మించుకోవాలని మండల స్థాయి ప్రజాప్రతినిధులకు సూచించారు. రికార్డుల నిర్వహణలో కొన్ని పంచాయతీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వాటి పరిరక్షణకు



పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ఈ బృందంలో కేంద్ర బృందం ప్రతినిధులు సునీల్ బంటా, నాథూ సింగ్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ సావిత్రి, ఎంపీడీవో గంటా వెంకటరావు, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఆయా పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువులు కొందరికేనా?

వంగర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న ఎరువులు కొందరికేనా.. అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బాగెమ్మపేట రైతు సేవా కేంద్రానికి శుక్రవారం రాత్రి 420 బస్తాలతో యూరియా లారీ వచ్చింది. ఆ యూరియాను గ్రామ ఏఈవో అప్పలనాయుడు సచివాలయ సమీపాన గల కోళ్లఫారంలో నిల్వ చేశారు. దీంతో రైతులు శనివారం ఉదయం పెద్దఎత్తున సచివాలయానికి చేరుకున్నారు. లైన్‌లో నిలబడ్డారు. ఒకరికి ఒకటి చొప్పున పదిమంది రైతులకు యూరియా ఇచ్చి, అయిపోయిందని అధికారులు చేతులెత్తేశారు. దీంతో రైతులు ఆగ్రహించారు. అధికారులకు శాపనార్థాలు పెట్టారు.

మా సిబ్బంది తప్పిదమే..

బాగెమ్మపేటలో యూరియా పంపిణీలో జరిగిన నిర్లక్ష్యం మా సిబ్బంది తప్పిదమే. యూరియా వచ్చినట్లు తమకు తెలియపరచకుండా వేరే చోట నిల్వ ఉంచారు. దీంతో కొందరు బలవంతంగా డబ్బులు ఇచ్చి యూరియాను పట్టుకుపోయారు. పై అధికారులకు జరిగిన విషయాన్ని తెలియజేస్తా. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తా. **- కన్నబాబు, ఏవో, వంగర**



బొడ్డవరలో నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలి

● సీపీఎం జిల్లా నేత చల్లా జగన్ ● జిందాల్ నిర్వాసితులతో కలిసి నిరసన

శృంగవరపుకోట రూరల్ జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యం 2008లో నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని సీపీఎం జిల్లా నేత చల్లా జగన్ డిమాండ్ చేశారు. భూమి కోల్పోయిన వారికి ఉద్యోగాలు, పరిశ్రమల్లో వాటా ఇలా చాలా హామీలు ఇచ్చారని, వాటిపై ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత లేదని తెలిపారు. శనివారం బొడ్డవరలో ఆయన నిర్వాసితులతో మాట్లాడారు. జిందాల్ యాజమాన్యం ఇచ్చిన స్క్రిప్టును ప్రారంభం నుంచి కలెక్టర్, మంత్రి శ్రీనివాస్, ఇప్పుడు హోం మంత్రి చెబుతున్నారని ఆయన ఆరోపించారు. భవిష్యత్‌లో పెడతామన్న కంపెనీల్లో ఏవిధంగా న్యాయం చేస్తారో అన్న విషయంపై వీరితో చర్చించకపోవడం బాధాకరమన్నారు. భూములిచ్చి దగా పడ్డవారిని విస్మరించడం తగదన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

భోగాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి సమీప జాతీయ రహదారి ఎత్తు బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయ రహదారిలో ఒక వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా.. అదే రహదారిలో వెళ్తున్న కారు బలంగా ఢీకుంది. గాయాలపాలైన ఆ వ్యక్తిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుని వివరాలు తెలిసినవారు భోగాపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

దేవుదళ సచివాలయంలో ఫర్నీచర్ ధ్వంసం

రేగిడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేవుదళ గ్రామ సచివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హల్‌చల్ చేశారు. ఒక కంప్యూటర్‌ను, ఐదు ఇనుప కిటికీ మెస్‌లను ధ్వంసం చేశారు. వస్తువులను చెల్లాచెదురు చేశారు. కంప్యూటర్ వైర్లను కట్‌చేశారు. శనివారం ఉదయం సిబ్బంది యథావిధిగా సచివాలయం తెరిచేసరికి వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడిఉన్నాయి. కంప్యూటర్ వైర్లు కట్ చేయడంలో సేవలు నిలిచిపోయాయి. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ గౌరినాయుడు సచివాలయాన్ని సందర్శించి, జరిగిన ఘటనపై ఆరా తీశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నీలావతి తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

భోగాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మహారాజపేట గ్రామంలో ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు అదే గ్రామానికి చెందిన కనకల సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ కె.దుర్గాప్రసాద్ రావు శనివారం తెలిపారు. గ్రామంలోని తన ఇంటి ఆవరణలో ఈనెల 17న ఏపీ39 క్యూయూ7388 నెంబరు గల ద్విచక్రవాహనం ఉంచానని, మరుసటి రోజు ఉదయం చూసేసరికి కనిపించలేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు నిమిత్తం ఎస్ఐ పాపారావు కు అప్పగించామని సీఐ తెలిపారు.

బెల్లంఊట ధ్వంసం

వంగర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వీవీఆర్ పేటలో నాగావళి నది ఒడ్డున సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1500 లీటర్ల బెల్లంఊటను శనివారం ధ్వంసం చేశామని ఎస్ఐ షేక్‌శంకర్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసి, బెల్లంఊటను ధ్వంసం చేశామన్నారు.

అర్హులకు ఉచిత న్యాయ సహాయం

శృంగవరపుకోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అర్హులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, ఎస్.కోట న్యాయాధికారిణి బి.కనకలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.సతీష్ అధ్యక్షతన పొదుపు మహిళలతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల్లో జరుగుతున్న అన్యాయంపై మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రూ.3లక్షల వార్షిక ఆదాయం దాటని వారికి మాత్రమే ఈ వెసులుబాటు ఉందన్నారు. ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నవారు ఉభయ పార్టీల సమక్షంలో ఉచితంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. సీనియర్ న్యాయవాది గేదెల ప్రకాష్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

డెంకాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని అదనపు కమాండెంట్ సి.రాజారెడ్డి తెలిపారు. శనివారం చింతలవలస ఐదో పోలీసు బెటాలియన్‌లో 'జగమంతా వనం-ఆరోగ్యంతో మనం' నినాదంతో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న అదనపు కమాండెంట్ రాజారెడ్డి

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

శృంగవరపుకోట రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొట్టాం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు రూ.50వేలు విలువచేసే క్రీడా దుస్తులు వితరణ చేశారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం వీటిని అందజేశారు. ఉపాధ్యాయులు పి.భాస్కరరావు, బంగారునాయుడు, సింహాచలంనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపండి

● మాజీ మంత్రి బొత్స

గరివిడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాలనలో లోపాలను ఎత్తిచూపాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం గరివిడిలో గల తన క్యాంపు కార్యాలయంలో ఆయన చీపురుపల్లి మండలానికి చెందిన వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడం లేదన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బెల్లాన చంద్రశేఖర్, బొత్స సందీప్‌బాబు పాల్గొన్నారు.

క్వారీ కార్మికుల సమ్మె

దత్తిరాజేరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): సరేవలస గ్రామ పరిధిలో ఉన్న క్వారీలో పనిచేస్తున్న కార్మికులు శనివారం సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య, భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. యాజమాన్యం ఫిర్యాదు మేరకు పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి అక్కడకు చేరుకుని, కార్మికులతో మాట్లాడారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మెను విరమించారు.

ఆయిల్‌పామ్ తోటలపై దృష్టి సారించాలి

భోగాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): అధిక రాబడిగల ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. సవరవల్లి గ్రామంలో కూర్మారావు అనే రైతు వేసిన ఆయిల్ పామ్ తోటలను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి సంబంధించి ఎకరాకి రూ.27వేలు విలువ చేసే మొక్కలు, ఇతరత్రా ఇన్‌పుట్ రాయితీలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ రాయితీ ప్రకారం ఎకరాకి ఖర్చులు పోను రైతులు రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఉమాభరణి, వీహెచ్ఏ శాంతి, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

విద్యతో పేదరికాన్ని జయించవచ్చు

కొత్తవలస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత ఉంటే పేదరికాన్ని జయించవచ్చని కొత్తవలస కోర్టు న్యాయాధికారి డా.సముద్రాల విజయ్ చందర్ అన్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా వీవోఏలకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. వెలుగు ఏపీఎం వెంకటరమణ, ఎస్ఐ హేమంత్‌కుమార్, న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, న్యాయవాదులు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

డ్రోన్ల పంపిణీ

గంట్యాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్లు పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని నరవ గ్రామంలో శనివారం ప్రారంభించారు. టీడీపీ నాయకుడు కొండపల్లి కొండలరావు చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, అల్లు విజయకుమార్, రంధి రామునాయుడు, జనసేన నాయకులు సారాధి అప్పలరాజు, వ్యవసాయ శాఖ ఏవో శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత నృత్య కళాశాల అభివృద్ధికి కృషి

విజయనగరం బాబామెట్ట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహారాజా సంగీత నృత్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మి అన్నారు. శనివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తాను ఇదే కళాశాలలో 31 ఏళ్లు అధ్యాపకురాలిగా బాధ్యతలు నిర్వహించానన్నారు. పదోన్నతిపై రాజమహేంద్రవరం సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వెళ్లి, తిరిగి తాను అధ్యాపకురాలిగా పనిచేసిన కళాశాలకు ప్రిన్సిపాల్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ

లక్కవరపుకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట గత మూడు రోజులుగా నిరసన చేస్తున్న పారిశుధ్య కార్మికులు శనివారం సమ్మె విరమించారు. ఈ నిరసనపై ఎంపీడీవో ఎస్.అప్పారావు స్పందించి.. ప్రభుత్వం జీతాలు వేసిన వెంటనే ఇస్తామని, అంతవరకు రెండు నెలల జీతం అందిస్తామని తెలపడంతో వీరు సమ్మెను విరమించారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోండి

విజయనగరం దాసన్నపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డక్కిన వీధిలో ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా నడుపుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కన్వీనరు బొబ్బాది సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాల నడపడడం వల్ల విద్యార్థులు రాబోయే రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్కారు చొరవ.. ఈడేరనున్న కల

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి సారించింది. గత వైసీపీ సర్కారు కాలంలో చేపట్టిన పనులకు సంబంధించి మొదటి విడతగా సుమారు రూ.7కోట్ల పైబడి బిల్లులు చెల్లించింది. మరో రూ.9 కోట్ల బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధం చేస్తోంది. ఏదేమైనా సీఎం ఆదేశాలతో కొద్దిరోజుల్లో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనులు తిరిగి ప్రారంభం కానునుండడంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా కొంతమంది, పరోక్షంగా మరి కొంతమందికి ఉపాధి లభిస్తుంది. అదే విధంగా గిరిజన విద్యార్థులకు ఇక్కట్లు తప్పుతాయి. స్థానికంగా ఇంజనీరింగ్ విద్య చదువుకునే అవకాశం దొరుకుతుందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు. 'కూటమి ప్రభుత్వం సుమారు రూ. ఏడు కోట్ల వరకు బిల్లులు చెల్లించింది. మిగిలిన బిల్లులు చెల్లించాల్సి ఉంది. రూ. కోటి 50 లక్షల పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేయాలి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.' అని ఏపీఈడబ్ల్యూసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు.

భవనాల పరిశీలన

పార్వతీపురం/కురుపాం: కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేట్ చైర్మన్ ఎస్.రాజశేఖర్ శనివారం పరిశీలించారు. పనులు ఎప్పుడు ప్రారంభించారు? ఎందుకు నిలిపివేశారు! తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. 2021లో పనులు ప్రారంభించామని, అప్పట్లో సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణం నిలిచిపోయినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. కాగా మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, చైర్మన్ వివరించారు.

పెట్రోల్ బంకులపై పర్యవేక్షణేదీ?

(5వ పేజీ తరువాయి)

రూపంలో రూ.2.33 లక్షలు వసూలు చేశారు. గత ఆరు నెలల కాలంలో 214 తనిఖీలు జరపగా.. 29 కేసులు నమోదు చేశారు. రూ.3.39 లక్షలు జరిమానా వసూలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

కానరాని సౌకర్యాలు..

పెట్రోల్, డీజిల్ కొట్టించుకునే వాహనదారుల కోసం బంకుల వద్ద కొన్ని సౌకర్యాలు ఉండాలి. కానీ, చాలాచోట్ల ఆ సదుపాయాలు లేవు. కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించడంలేదు. మరుగుదొడ్లు ఉన్నా తాళాలు వేసి ఉంచుతున్నారు. కేవలం సిబ్బంది సొంత అవసరాలకే వాటిని వినియోగిస్తున్నారు. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత కొరవడితే ఏ అధికారికి ఫిర్యాదు చేయాలి? ఎవర్ని సంప్రదించాలి? అనేది వివరాలతో సహా పొందుపరచాలి. కానీ, కొద్ది బంకుల్లోనే వీటిని పొందుపరుస్తున్నారు. వాస్తవానికి తమ పరిధిలో ఉండే బంకులను తూనికలు కొలతల శాఖ అధికారులతో పాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది నిత్యం తనిఖీ చేయాలి. సంబంధిత ఆయిల్ కంపెనీ ప్రతినిధి సైతం సందర్శిస్తుండాలి. కానీ, జిల్లాలో అవెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. అందుకే బంకు యాజమాన్యాలు కల్తీతో పాటు ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

తనిఖీలు చేస్తున్నాం..

పెట్రోల్ బంకుల్లో కల్తీ చేసినా, కొలతల్లో మోసానికి పాల్పడినా చర్యలు తప్పవు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉన్న బంకులన్నీ పౌరసరఫరాలు, తూనికల, కొలతల శాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. రెండు శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేస్తున్నారు. మాదృష్టికి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నాం. ఎక్కడైనా మోసాలు జరిగితే వెంటనే ఫిర్యాదు చేయవచ్చు. టోల్‌ఫ్రీ నంబర్లు సైతం అందుబాటులో ఉన్నాయి.

-రంగారెడ్డి, తూనికలు, కొలతల శాఖ అధికారి, ఉమ్మడి జిల్లా

గంజాయి నియంత్రణకు ప్రత్యేక బృందాలు

(5వ పేజీ తరువాయి)

ముందుకు సాగాలి, ఇతర శాఖల సమన్వయంతో చేస్తున్న చర్యలను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వివరించారు. అనుమతి లేకుండా విద్యా సంస్థల్లో ప్రవేశించడానికి ఎవరికి అధికారం లేదన్నారు. అనంతరం వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ● జిల్లా పోలీస్ కార్యాలయం, డీసీఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్, సైబర్‌సెల్ తదితర విభాగాలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి శనివారం తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో రికార్డులు పరిశీలించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం అధికారులు, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఎస్పీ అంకితా సురాన, డీఎఫ్‌వో ప్రసన్న, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తక్కువ శ్రమతో అధిక దిగుబడులు



వరి విత్తనాలను నాటిస్తున్న శ్రావణ్‌కుమార్

జియ్యమ్మవలస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): డ్రమ్ సీడర్ విధానంతో తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు ఎం.శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం అలమండ పంచాయతీ మరువాడలో ఎర్ర సత్యనారాయణ వరి క్షేత్రం డ్రమ్ సీడర్‌తో విత్తనాలను నాటారు. మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి ఆధ్వర్యంలోకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తనాలను నాటడానికి డ్రమ్ సీడర్ సహాయపడుతుందన్నారు. 15 రోజుల ముందుగానే పంట కోతకు వస్తుందన్నారు. అనంతరం అల్లువాడ సర్పంచ్ బి.పరిశినాయుడు ఆధ్వర్యంలో దశపర్ని కషాయం తయారు చేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరామ్, సీహెచ్.లక్ష్మణ్, వై.కృష్ణ, పోలినాయుడు, రైతులు గోపాలరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు అభినందనలు

పార్వతీపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియామకమైన గొట్టాపు గౌరిని ఏఎంసీ ఉద్యోగులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, విశ్రాంత ఉద్యోగులు శనివారం అభినందించారు. మండలంలోని నర్సిపురంలోని ఆమె నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో యువకులకు జరిమానా

పార్వతీపురం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో యువకులకు రూ.1.20 లక్షలు జరిమానా విధించినట్లు పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు. శనివారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 12 మంది యువకులను. జుడిషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ ఒక్కొరికి రూ.10 వేలు చొప్పున జరిమాన విధించారన్నారు. రెండో సారి మద్యం సేవించి వాహనాలు నడిపితే మూడు నెలల జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారని సీఐ తెలిపారు

సువర్ణముఖికి జలకళ

మక్కువ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు శంబర సమీపంలో ఉన్న వెంగళరాయసాగర్ జలాశయంలోకి భారీ వరదనీరు వచ్చి చేరుతోంది. జలాశయం గేట్లుఎత్తి సువర్ణముఖి నదిలోకి 400 క్యూసెక్కుల వరద నీటిని శనివారం విడిచిపెట్టారు.దాంతో సువర్ణముఖి జలకళ సంతరించుకుంది. నదిలో పూర్తిస్థాయిలో నీటి ప్రవాహం కొనసాగుతోంది. నదీపరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం



సీతంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం మానవ మనుగడకే ముప్పు అని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఐటీడీఏలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ పరిసరాల్లోని ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాలను ఇన్‌చార్జి పీవోతో పాటు అధికారులు శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నాదొర, ఏవో సునీల్, పీహెచ్‌వో ఆర్‌వీ గణేశ్, ఏపీవో విజయరాణి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ పాల్గొన్నారు.

●పాలకొండ: ప్లాస్టిక్ వినియోగానికి ప్రజలు స్వస్తి పలకాలని మండల ప్రత్యేక అధికారి వైకుంఠరావు, నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు అన్నారు. పట్టణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించాలని కమిషనర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, సచివాలయం, మున్సిపల్, శానిటేషన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

●సాలూరు: ప్లాస్టిక్‌ను వాడవద్దని మున్సిపల్ కమిషనర్ బి.వి.ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక మున్సిపాలిటీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ, పురపాలక సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి: ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందని డీఐవో డాక్టర్ తెర్లి జగన్మోహన రావు అన్నారు. శనివారం గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ఎంకే తిరుమల ప్రసాద్, డా.కౌశిక్, డా.కాసుల వర్మ, సిబ్బంది సన్యాసిరావు, డి.మృత్యుంజయరావు, సత్తిబాబు పాల్గొన్నారు.



పాలకొండలో...



సాలూరులో...



గరుగుబిల్లిలో ప్రతిజ్ఞ..

సమస్యల పరిష్కారమే ధ్యేయం



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు.శనివారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తాగునీరు, రోడ్డు సౌకర్యం తదితర సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

అనుచిత వ్యాఖ్యలపై ఖండన



మాట్లాడుతున్న శేఖర్ పాత్రుడు

కొమరాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జీఎంవలస మండలం టీఎన్ వలస గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇత్తిలి మణి సామాజిక మాధ్యమంలో కురపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ పాత్రుడు అన్నారు. శనివారం మాదలింగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిని జీఎం వలస పోలీసులు పిలిచి విచారించిన విషయంపై మాజీ మంత్రి పుష్పశ్రీవాణి ప్రెస్‌మీట్‌లు పెట్టి సమర్థించడం తగదన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బ తీయకుండా స్వీయ నియంత్రణలో మాట్లాడాలన్నారు. వైసీపీ వైఫల్యాలను డైవర్ట్ చేయడానికి ఎమ్మెల్యే జగదీశ్వరిపై విమర్శలు చేయడం తగదన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గౌరీశంకర్, కొరమాడ మండల జనసేన కన్వీనర్ తెంటు శ్రీకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్.నాయుడు, బీజేపీ కన్వీనర్ ద్వారపురెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసుల సంస్కృతి వైసీపీదే



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గరుగుబిల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులు నమోదు చేసే సంస్కృతి వైసీపీదేనని టీడీపీ నాయకులు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి.. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిపై చేసిన వ్యాఖ్యలను ఓబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, టీడీపీ నాయకులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, డి.సత్యనారాయణ తదితరులు ఖండించారు. శనివారం గురుగుబిల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన వారిపై కేసులు పెట్టడం తథ్యమన్నారు. పుష్పశ్రీవాణి ఒక మహిళపై తప్పుడు కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లడం కొత్త సంస్కృతిని తెచ్చారనే ఆమె ఆరోపణలను ఖండించారు. ఎన్నికల సమయంలో రౌడీలను స్వయంగా తీసుకువెళ్లి టీడీపీ నాయకుడిపై దౌర్జన్యం చేసిన ఘటన మరిచారా అని ప్రశ్నించారు. దౌర్జన్యం చేసిన చరిత్ర మీది కాదా అని నిలదీశారు. టీడీపీలో చేరేందుకు వైసీపీ నాయకులు వరుస కడుతున్నారన్నారు. కొద్ది రోజుల్లో పార్టీ ఖాళీ అవడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు అంబటి రాంబాబు, కె.సుమన్, ఎ.రామకృష్ణ, వై.శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, పాపినాయుడు, ఎం.నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వేపాకులు తింటూ నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏడో రోజు శనివారం ఇంజనీరింగ్ కార్మికులు వేపాకులు తింటూ నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని పాలకులు చెప్పినప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదని వారన్నారు. షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తంపజేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, వై.హరిబాబు, పి.సాయి, ఎస్.బాబూరావు, టి.వెంకటరమణ, ఐ.రాజు, టి.ఈశ్వర్‌కుమార్, ఎన్.మహేష్, పి.సాయి, జి.నారాయణ, బి.సురేష్, ఎన్.అరవింద్, పి.సతీష్, పి.రమేష్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన మీ చేతుల్లోనే..

●రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు



మాట్లాడుతున్న న్యాయాధికారి దామోదరరావు

జియ్యమ్మవలస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన మీ చేతుల్లోనే ఉందని రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు అన్నారు. శనివారం మండలంలోని బొమ్మిక గ్రామంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తన విద్యా ప్రమాణ స్థాయి పెంచుకుని జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. తద్వారా మంచి ఉద్యోగవకాశాలు సాధించవచ్చన్నారు. అలాగే రైతులు సాగులో యంత్ర పరికరాలను వినియోగించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలు సక్రమంగా వినియోగించుకుని పేదరికాన్ని నిర్మూలించుకోవచ్చన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువు గండిని పూడ్చండి

మక్కువ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తూరుమామిడిలోని పనుకు చెరువుకు పడిన గండిని తక్షణమే పూడ్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. శనివారం గండి పడిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంగళరాయసాగర్ పరిధిలోని కాలువలు, చెరువులకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎప్పటికప్పుడు గండ్లు పడుతున్నాయన్నారు. దాంతో వెంగళరాయసాగర్ నీరు శివారు ప్రాంతాలకు చేరే అవకాశం లేకపోతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలు, చెరువులకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

గ్రామసభలకు వైసీపీ సర్పంచ్‌లు గైర్హాజర్

మక్కువ రూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండలంలో శనివారం అధికారులు నిర్వహించిన గ్రామసభలకు వైసీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. మండలంలో లింక్ రోడ్లు, సీసీ రోడ్లతో పాటు వివిధ అభివృద్ధి పనులకు ఇటీవల రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి రూ.20 కోట్లను మంజూరు చేయించారు. ఈ పనులన్నింటికీ పంచాయతీ, సర్పంచ్‌ల తీర్మానాలు చేయడం తప్పనిసరి. దాంతో మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శనివారం గ్రామసభలను నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఆదేశాలిచ్చారు. అయితే మండలంలో 21 పంచాయతీలు ఉండగా అందులో 18 పంచాయతీల్లో వైసీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉన్నారు. కేవలం 3 పంచాయతీల్లోనే టీడీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉన్నారు. ఇందులో పనసభద్ర, సన్యాసిరాజపురం, మార్కొండపుట్టి, కవిరిపల్లి, కొయ్యానపేట సర్పంచులు గ్రామాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తీర్మానాలు చేశారు. రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపడితే కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే ఉద్దేశంతో వైసీపీ మద్దతుదారులు పనుల తీర్మానాలకు హాజరుకానట్టు తెలుస్తోంది. ●మండలంలో శనివారం నిర్వహించిన గ్రామసభలకు 18 మంది సర్పంచ్‌లు హాజరు కాలేదనే విషయాన్ని ఎంపీడీవో స్వరూపరాణి వద్ద ప్రస్తావించగా కొంతమంది మాత్రమే హాజరయ్యారన్నారు. సోమవారం సరికి అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వాలని సర్పంచ్‌లను ఆదేశించామన్నారు.

ఎంఈవోల నియామకం

గరుగుబిల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో రెండు మండలాలకు మండల విద్యా శాఖాధికారులను నియామకం చేస్తూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గరుగుబిల్లి ఎంఈవో (ఎఫ్ఏసీ)గా సీతంపేట గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు, జియ్యమ్మవలసకు పాలకొండకు చెందిన ప్రధానోపాధ్యాయుడు డి.నాగభూషణరావులను నియమించారు.

భాషా నైపుణ్యాలపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): భాషా నైపుణ్యాలపై దృష్టి సారించాలని ఎంఈవో-1 సామల సింహాచలం సూచించారు. శనివారం మండలంలోని గొల్లవానివలస, కేఆర్ఎన్ వలస పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అభ్యాసన స్థాయిని పెంచాలన్నారు. పాఠశాలల బలోపేతంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ● అలాగే గరుగుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఎంఈవో-1 సామల సింహాచలం హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.కొండలరావు, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●వీరఘట్టం: విద్యా ప్రమాణాల మెరుగునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఆనందరావు సూచించారు. శనివారం కత్తుల కవిటి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు చేరికలను పెంచాలన్నారు. పాఠశాలల పర్యవేక్షణకు జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాయన్నారు. టీచర్ హ్యాండ్ బుక్, స్టూడెంట్ అసైన్‌మెంట్ బుక్‌లు ఎలా ఉపయోగించాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో అంధకారం



చీకటిలో బంధంవారి వీధి

పార్వతీపురం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రంలో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. ఇంజనీరింగ్ విభాగ అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. పార్వతీపురంలో వ్యాపార కేంద్రమైన బంధంవారి వీధిలో అంధకారం రాజ్యమేలుతోంది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. చీకటిపడితే బంధంవారి వీధి మీదుగా వెళ్లాలంటే స్థానికులు భయపడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ సన్యాసిరావు వివరణ కోరగా వీధిలైట్ల మరమ్మతులు చేపడతామన్నారు.

బైక్‌లు ఢీ: నలుగురికి గాయాలు

మక్కువ రూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం పంచాయతీ ములక్యాయవలస సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. శనివారం ఉదయం మక్కువ, చెముడు గ్రామాలకు చెందిన కాత తనూజ్ కుమార్, చోడవరపు జస్వంత్.. చెముడుకి చెందిన వి.విష్ణు, వెంకట భైరిపురానికి చెందిన గంట సాగర్ వేర్వేరుగా రెండు మోటార్ సైకిళ్లపై వస్తూ ఢీ కొన్నారు. ఈ ప్రమాదంతో నలుగురూ గాయపడ్డారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో తనూజ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాడు.

కూరగాయల వ్యాన్ బోల్తా



బోల్తా పడిన వ్యాన్ ఇదే..

కొమరాడ, జూలై19 (ఆంధ్రజ్యోతి): కోటిపాం సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై కూరగాయల వ్యాన్ శనివారం బోల్తాపడింది. రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో రాయగడ వెళుతున్న కాయగూరల వ్యాన్ ప్రమాదానికి గురైంది. కూరగాయలు నేల పాలయ్యాయి. కొమరాడ మండల పరిధిలో కొన్ని గ్రామాల్లోని రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసికొందరు వ్యాపారులు రాయగడ తీసుకు వెళ్లి విక్రయిస్తుంటారు.

సారాతో ఇద్దరి అరెస్టు

పాలకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలంలోని బోయన్నగూడలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 10 లీటర్ల సారా, 1300 లీటర్ల బెల్లపు ఊటతో సవర చంద్రరావు, పది లీటర్ల సారాతో సవర మంగయ్య పట్టుబడ్డారు. వారితో పాటు సారా తయారీకి అవసరమైన నల్ల బెల్లంను చంద్రరావుకు సరఫరా చేసిన బూర్లె కృష్ణ, కల్లేపల్లి కృష్ణలపైన కూడా కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ కె.సూర్య కుమారి తెలిపారు. చంద్రరావు, మంగయ్యలను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచామన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED పార్వతీపురం బ్రాంచి పార్వతీపురం వారు ఇచ్చిన లోగట్టా ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూల్లో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని **శ్రీ/శ్రీమతి కోట నాగరాజు S/o కోట ఆదినారాయణ** వీరి యొక్క ప్రాపర్టీని షూరిటీగా తీసుకొని వీరికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికేనా ఎటువంటి జప్తులు, చార్జీలు, క్రయాములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడు దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నాక్లయింటు భాధ్యులుకారు.

షెడ్యూలు : పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం సబ్.డి., పార్వతీపురం మండలం, అడ్డాపుశీల పంచాయితీ, అడ్డాపుశీల గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వేనెం.63-1బి రుల్లో భాగమైనటువంటిన్ని తూ॥ప॥కు 66అ॥లు (20.13మీ॥లు) పొడవున్నూ, ఉ॥ద॥లకు 20అ॥ (6.10మీ॥లు) వెడల్పు కలిగి అనగా 146.66 చ॥గ॥లు లేక 122.61చ॥మీ॥లు వైశాల్యం కలిగిన ఖాళీస్థలమునకు **హద్దులు : తూ:** ఇతరుల ఖాళీస్థలం, **ద:** బత్తుల వెంకటేశ్వర్లు గారి తాలూకా ఖాళీస్థలం, **ప:** సిసి రోడ్డు, **ఉ:** రాయిపల్లి లక్ష్మిగారి తాలూకా ఖాళీస్థలం.

G. Sesi Bhushana Rao, M.A.,B.L.,D.I.R.P.M., D.P.A., Advocate, Belagam, Parvathipurm, 9441037247

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED బొబ్బిలి బ్రాంచి బొబ్బిలి వారు ఇచ్చిన లోగట్టా ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూల్లో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని **శ్రీ/శ్రీమతి బొడ్డు సీతారాం S/o బొడ్డు ఎరకయ్య** వీరి యొక్క ప్రాపర్టీని షూరిటీగా తీసుకొని వీరికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి జప్తులు, చార్జీలు, క్రయాములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడు దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నాక్లయింటు భాధ్యులుకారు.

షెడ్యూలు : విజయనగరం జిల్లా, విజయనగరం వెస్ట్ సబ్.రి, యిలాకా, ఇదివరలో గాజులరేగ గ్రామ పంచాయితీ, ప్రస్తుతం విజయనగరం మున్సిపాలిటీలో చేరినటువంటిన్ని, గాజులరేగ మధుర రాళ్లమాలపల్లి గ్రామం దాఖలా సర్వేనెం.85/1రులో భాగమైనటువంటిన్ని స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు కొలతలు, హద్దులు వివరము: కొలతలు తూ॥ప॥కు 31అ॥లు (9.45మీ॥లు), ఉ॥ద॥లకు 47అ॥ (14.33మీ॥లు) విస్తీర్ణం: 161.88చ॥గ॥లు లేక 162.71చ॥మీ॥లు గల **హద్దులు : తూ:** రోడ్డు కొంతమేర, నా తాలూకా ఖాళీస్థలము కొంతమేర, **ద:** 30అడుగుల వెడల్పు గల రోడ్డు, **ప:** ఉదయపురం సారధి గారి ఇల్లు, **ఉ:** ఇతరుల స్థలము.

Teella Murali Krishna, B.A.,B.L, Advocate, D.No: 30-1-45, Backside of town police station, Salur, Parvathipuram Manyam Dist. 9441612123



